సాక్షి నిజామాబాద్

మంగళవారం । 17 । జూన్ । 2025



బ్యాంకులు సామాజిక..

బ్యాంకులు సామాజిక బాధ్యతతో ప్రజల అభివృద్ధికి తోడ్పాటునందించాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸



సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.9 /24.0

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్



నిజామాబాద్‌అర్బన్: కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వినయ్ కృష్ణారెడ్డి సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీవీఎన్ భరత లక్ష్మిని మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా న్యాయస్థానాల సముదాయ భవనంలోని జిల్లా జడ్జి చాంబర్‌లో ఆమెకు పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా స్థితిగతులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలపై ఇరువురు కాసేపు చర్చించారు.

రెవెన్యూ దరఖాస్తుల నోటీసులు సిద్ధం చేయాలి

- బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో



బోధన్: గ్రామ రెవెన్యూ సదస్సులలో స్వీకరించిన ప్రతి దరఖాస్తుకు సంబంధించి మాడ్యూల్ ప్రకారం జారీ చేసేందుకు నోటీసులు సిద్ధం చేయాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అధికారులకు సూచించారు. సాలూర తహసీల్ కార్యాలయాన్ని సోమవారం సాయంత్రం ఆయన సందర్శించారు. మండలంలో ఇప్పటి వరకు జరిగిన రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌లో పారదర్శకంగా నమోదు చేయాలని సూచించారు.

21న ఫుడ్ ఫెస్టివల్

నిజామాబాద్ సిటీ: మెప్మా, మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో 50 నుంచి 80 స్టాల్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు స్టాల్స్ నిర్వహిస్తారు. డ్వాక్రా, ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు, చిరు, తోపుడు బండ్ల ద్వారా వ్యాపారం చేసేవారు స్టాల్స్‌లో పాల్గొననున్నారు.


జీవన్‌రెడ్డి చర్యలతోనే బీఆర్‌ఎస్ పతనం



ఆర్మూర్‌టౌన్: మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, ఆయన తమ్ముడు రాజేశ్వర్ రెడ్డిల చర్యలతోనే ఆర్మూర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ పతనమైందని ఆ పార్టీ జిల్లా మాజీ కార్యదర్శి అర్గుల్ సురేశ్ ఆరోపించారు. ఆర్మూర్‌లోని ప్రెస్‌క్లబ్ భవన్‌లో సోమవారం మీడియాతో ఆయన మాట్లాడారు. ఆర్మూర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ వెంట వేల సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఉండేవారని, కానీ వారిని దూషించడంతోనే జీవన్‌రెడ్డికి ఈ పరిస్థితి దాపురించిందన్నారు. ఆయన చెప్పిందే వేదమని, ఆయన కాదన్న వారిపై కేసులు బనాయించి జైలుకు పంపించడం లాంటి చర్యలు చేపట్టారని విమర్శించారు. జీవన్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి పార్టీలో ఉంటే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఎవరూ ఓటు వేయరన్నారు. ఈ విషయాన్ని పార్టీ అధినేత కేసీఆర్, కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఆయన వెంట రాచర్ల దశరత్ తదితరులు ఉన్నారు.



స్థానిక వేడి



స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో పల్లె, పట్టణాల్లో ఒక్కసారిగా ఎన్నికల వేడి మొదలయ్యింది. రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే స్థానిక ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపిస్తాయని కాంగ్రెస్ నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీ కాంగ్రెస్‌ను దీటుగా ఎదుర్కొనేందుకు పట్టణాలు, గ్రామాల్లోనూ వ్యూహంతో బీజేపీ ముందుకెళ్తోంది. ఉనికి కాపాడుకునే దిశగా బీఆర్‌ఎస్ శ్రేణులు తమ ప్రయత్నాలు చేస్తున్నారు.

- జోరుగా చర్చలు
- ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధం చేస్తున్న ప్రభుత్వం
- కాంగ్రెస్‌తో పోటీకి సై అంటున్న బీజేపీ
- సన్నబియ్యం, ధాన్యం బోనస్, భూభారతి లాభిస్తాయంటున్న కాంగ్రెస్ శ్రేణులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదిన్నర తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమైంది. తాజాగా మంత్రుల వరుస ప్రకటనలు అందుకు ఊతమిస్తున్నాయి. దీంతో పట్టణాలు, గ్రామాల్లో 'స్థానిక' వేడి పెరిగింది. నాయకుల్లో, వివిధ వర్గాల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఈ నెల చివరిలో నోటిఫికేషన్ విడుదల చేసి జూలైలో ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల నాయకులు ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు. పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసి 15 నెలలు, జెడ్పీ, ఎంపీపీల పదవులు దాదాపు ఏడాది కావస్తోంది. అలాగే మున్సిపాలిటీలకు గడువు ముగిసి ఆరు నెలలు గడిచిన విషయం తెలిసిందే.

పథకాలపైనే అధికార పార్టీ ఆశలు..!

రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే స్థానిక ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపిస్తాయని కాంగ్రెస్ నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం సరఫరా, సన్నధాన్యానికి రూ.500 బోనస్, ఇందిరమ్మ ఇళ్లు, భూ సమస్యల పరిష్కారం కోసం తెచ్చిన భూభారతి చట్టం, రైతు భరోసా, వంటి పథకాలు అమలవుతున్నాయి. సన్నబియ్యం పంపిణీ కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నింపింది. గ్రామీణ, పట్టణ ప్రజలు ప్రభుత్వంపై అనుకూలంగా ఉన్నారనే అభిప్రాయంతో ఉన్నారు. అలాగే రైతాంగానికి రూ.500 బోనస్ కూడా కాంగ్రెస్ అభ్యర్థులకు కలిసొస్తుందని అంటున్నారు. ఎట్టి పరిస్థితుల్లో జెడ్పీతో పాటు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌పై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని కాంగ్రెస్ శ్రేణులు ధీమాతో ఉన్నారు.

ఉనికి కోసం బీఆర్‌ఎస్..

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉనికి కాపాడుకోడానికి బీఆర్‌ఎస్ ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే కవిత లేఖతో గందరగోళానికి గురైన శ్రేణులకు.. అసలు పార్టీలో ఏం జరుగుతుందోనని స్పష్టత లేకుండాపోయింది. ఇదే సమయంలో ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తుండటంతో బీఆర్‌ఎస్‌కు కోలుకోలేని దెబ్బగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

రిజర్వేషన్లపై ఎవరి లెక్కలు వారివే..

ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనే నిర్ణయానికి రావడంతో ఆశావహుల పేర్లు తెరపైకి వస్తున్నాయి. రిజర్వేషన్ ఏం వస్తుందోనని ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా జిల్లా పరిషత్ చైర్మన్ తోపాటు నగర మేయర్ వంటి ప్రాధాన్యత కలిగిన పదవులను పార్టీలో సీనియర్లకు అప్పగిస్తారనే ప్రచారం అధికార పార్టీలో ఉంది. మీనాక్షి నటరాజన్ వచ్చిన తర్వాత పదవులు రాని సీనియర్ల బయోడేటాను స్వీకరించిన నేపథ్యంలో వారికి న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఏ పార్టీకి, ఆశావహులకు ఏ మేరకు కలిసొస్తాయో వేచిచూడాల్సిందే.!

ఢీ అంటే ఢీ..

స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు సంకేతాలు వెలువడుతున్న తరుణంలో అధికార పార్టీని ఎదుర్కొనేందుకు బీజేపీ నాయకులు ఢీ అంటే ఢీ అంటున్నారు. జిల్లాలో ఎంపీ, ఇద్దరు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలు ఉన్నారు. పట్టణాలతో పాటు గ్రామాల్లోనూ సత్తా చాటాలనే పక్కా వ్యూహంతో బీజేపీ ముందుకెళ్తోంది. ముఖ్యంగా జెడ్పీ, నిజామాబాద్ కార్పొరేషన్, ఆర్మూర్ మున్సిపాలిటీతోపాటు అత్యధిక సర్పంచ్ స్థానాలను బీజేపీ మద్దతుదారులు గెలుపొందేలా వ్యూహ రచన చేస్తున్నారు. ఎంపీ అర్వింద్ ధర్మపురి ఇటీవల ఎమ్మెల్యేలు, జిల్లా నాయకత్వంతో మంతనాలు జరిపారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి



మోర్తాడ్‌లో జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న గ్రామస్తులు

- ఓ వర్గానికి పోలీసులు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణ
- మోర్తాడ్‌లో జాతీయ రహదారిపై గ్రామస్తుల రాస్తారోకో
- తహసీల్ కార్యాలయం వరకు ర్యాలీ

మోర్తాడ్(బాల్కొండ): మోర్తాడ్‌కు చెందిన రొయ్యల సురేశ్ అనే యువకుడిపై 40 మంది దాడి చేస్తే కేవలం ఆరుగురిపైనే పోలీసులు కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారని గ్రామస్తులు ఆరోపించారు. దాడికి పాల్పడిన ప్రతి ఒక్కరినీ అరెస్టు చేయాల్సిందేనని డిమాండ్ చేస్తూ జాతీయ రహదారిపై సోమవారం బైఠాయించారు. మోర్తాడ్‌లోని అన్ని కుల సంఘాల సభ్యులు, రాజకీయ పార్టీలకు అతీతంగా గ్రామం నుంచి జాతీయ రహదారి వరకు ర్యాలీగా చేరుకున్నారు. అనంతరం రాస్తారోకో నిర్వహించి దాడికి పాల్పడిన, వారికి మద్దతు తెలుపుతున్న వారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించడంతోనే ఒక వర్గంవారు మోర్తాడ్‌లో రెచ్చిపోయి హిందువులను లక్ష్యంగా చేసుకొని భౌతికదాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. జాతీయ రహదారిపై బైఠాయించడంతో కరీంనగర్, నిజామాబాద్ రూట్‌లలో వెళ్లాల్సిన వాహనాలు భారీ సంఖ్యలో నిలిచిపోయాయి. భీమ్‌గల్ సీఐ సత్యనారాయణ, మోర్తాడ్ ఎస్సై విక్రమ్, ఇతర పోలీసు అధికారులు ఆందోళనకారులతో చర్చించారు. నిందితుల కోసం గాలిస్తున్నామని, ఇప్పటి వరకూ తాము గుర్తించిన ఆరుగురిని రిమాండ్‌కు తరలించామని సీఐ, ఎస్సైలు వివరించారు. త్వరలోనే మిగతా నిందితులపై చర్యలు తీసుకుంటామని సీఐ హామీ ఇవ్వడంతో గ్రామస్తులు రాస్తారోకో విరమించారు. అనంతరం తహసీల్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేశారు. బాధితుడు రొయ్యల సురేశ్‌కు సరైన న్యాయం జరిగే వరకు తాము ఊరుకోబోమని గ్రామస్తులు స్పష్టం చేశారు.

'రైతునేస్తం' సద్వినియోగం చేసుకోవాలి

- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి



వీసీలో పాల్గొన్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

జక్రాన్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'రైతునేస్తం' కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతువేదికలకు వీడియో కాన్ఫరెన్స్ వ్యవస్థను అనుసంధానం చేస్తూ 'రైతునేస్తం' కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి సోమవారం వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం రైతుభరోసా నిధులను విడుదల చేశారు. జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ రైతువేదికలో నిర్వహించిన కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతను సాగు రంగానికి అనుసంధానం చేస్తూ, రైతుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం రైతునేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. రైతునేస్తం ద్వారా ప్రతి మంగళవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులను సంప్రదించి సమస్యలను పరిష్కరించుకునే వెసులుబాటు ఏర్పడిందన్నారు. రుణమాఫీలో జిల్లా రైతాంగానికి రూ. 755.29 కోట్ల మేర లబ్ధి చేకూరగా, అత్యధికంగా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న రూరల్ నియోజకవర్గ రైతులకు రూ. 205 కోట్ల లబ్ధి చేకూరిందని హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, జిల్లా వ్యవసాయ అధికారి వీరాస్వామి, ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్ మునిపల్లి సాయిరెడ్డి, శేఖర్ గౌడ్, సొసైటీల చైర్మన్లు పాల్గొన్నారు.

జీరో విద్యుత్ ప్రమాదాలే లక్ష్యం

- భద్రతపై విస్తృత ప్రచారం చేపట్టాలి
- టెక్నికల్ డీఈలను సేఫ్టీ అధికారులుగా నియమించాలి
- వీసీలో టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి



వీసీలో మాట్లాడుతున్న సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

సుభాష్‌నగర్: జీరో విద్యుత్ ప్రమాదాలే లక్ష్యంగా సబ్ డివిజన్, సెక్షన్ల వారీగా విద్యుత్ భద్రతపై వినియోగదారులకు పూర్తి అవగాహన వచ్చేలా విస్తృత ప్రచారం చేపట్టాలని టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశించారు. వరంగల్‌లోని సంస్థ కార్పొరేట్ కార్యాలయం నుంచి 16 సర్కిళ్ల ఎస్‌ఈలు, టెక్నికల్ డీఈలతో సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ విద్యుత్ పనులు చేసే క్రమంలో సిబ్బంది జాగ్రత్తగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రమాదాలు జరిగే అవకాశమున్న లూజ్ లైన్లు, వంగిన, తుప్పు పట్టిన పోల్స్, తక్కువ ఎత్తులో ఉన్న డీపీఆర్ ప్లింత్‌లు, లైన్ క్రాసింగ్, డబుల్ ఫీడింగ్ వచ్చే వాటిని గుర్తించి మార్చాలన్నారు. రైతులు, విద్యుత్ వినియోగదారులు వారి పరిధిలో లూజ్ లైన్లు, తక్కువ ఎత్తులో ఉన్న డీటీఆర్ ప్లింత్‌లు, ప్రమాదకరంగా ఉన్న వాటిని గుర్తించి సెక్షన్ ఆఫీసర్‌కు తెలపాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లో విద్యుత్ పనులు చేయొద్దని, విద్యుత్ సమస్య తలెత్తితే 1912 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా సేవలు పొందాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రతి సర్కిల్‌లో టెక్నికల్ డీఈలను సేఫ్టీ అధికారులుగా నియమించాలన్నారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు ఫీల్డ్ సిబ్బంది నుంచి సీనియర్ అధికారుల వరకు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. వీసీలో ఇన్‌చార్జి డైరెక్టర్లు బీ అశోక్‌కుమార్, టీ మధుసూదన్, సీఈలు రాజుచౌహాన్, అశోక్, వెంకటరమణ, జీఎంలు ఉత్తమ్, సురేందర్, ఎస్‌ఈలు, డీఈ టెక్నికల్, డీఈ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పసుపు సాగుకు పూర్వవైభవం

- జిల్లాలో పెరుగుతున్న విస్తీర్ణం
- గత సీజన్‌లో 23 వేల ఎకరాల్లో సాగు
- ఈసారి 28 వేల ఎకరాలకుపైగా పండించేందుకు రైతుల మొగ్గు
- బోర్డు ఏర్పాటు, మంచి ధర లభించడంతో ఆసక్తి



దొన్కల్‌లో పసుపు విత్తనం విత్తుతున్న రైతులు



పసుపు విత్తనం సిద్ధం చేస్తున్న మహిళా రైతు

మోర్తాడ్(బాల్కొండ): మోర్తాడ్ మండలం తిమ్మాపూర్‌కు చెందిన రైతు ఎస్ రాజేశ్వర్ పసుపు సాగును పునఃప్రారంభించారు. గతంలో పసుపు సాగుతో నష్టాలను మూటగట్టుకున్నాడు. దీంతో ఐదేళ్లపాటు పసుపు పంటకు విరామం పలికాడు. గడిచిన సీజన్‌లో సాగైన పసుపు పంటకు ధర గరిష్టంగా క్వింటాలుకు రూ.16 వేలు పలకడంతో మళ్లీ ఆశలు చిగురించాయి. తన వద్ద విత్తనం లేకపోవడంతో తోటి రైతుల వద్ద ఒక్కో క్వింటాలుకు రూ.4 వేల ధర చెల్లించి ఆరు క్వింటాళ్లను కొనుగోలు చేశాడు. ఇదే గ్రామానికి చెందిన రైతు రాజశేఖర్ గతంలో మూడెకరాల్లో పసుపు సాగు చేయగా ఈసారి మరో ఎకరం సాగు విస్తీర్ణం పెంచాడు. ఇలా రాజేశ్వర్, రాజశేఖర్‌లే కాకుండా అనేక మంది రైతులు పసుపు సాగు విస్తీర్ణాన్ని పెంచుతున్నారు. పసుపు సాగుకు పూర్వ వైభవం తెచ్చేందుకు సన్నద్ధమవుతున్నారు.

గతంలో 50 వేల ఎకరాలు..

పసుపు పంట సాగుకు ప్రసిద్ధిగాంచిన నిజామాబాద్ జిల్లాలో ఒకప్పుడు 50 వేల ఎకరాల వరకు రైతులు సాగు చేసేవారు. పసుపు సాగుతో వ్యవసాయ కూలీలకు విస్తృతమైన ఉపాధి లభించేది. సాగు ఖర్చులు పెరగడం, ధర తగ్గిపోయి రైతులు నష్టాలను మూటగట్టుకున్న సందర్భాలు అనేకం. దీంతో సాగు విస్తీర్ణం ఏటా తగ్గుతూ వచ్చింది. అనేక మంది రైతులు పసుపునకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటలను ఎంచుకున్నారు. ఈసారి పసుపు పంటకు ధర ఆశాజనకంగా ఉండటం, కేంద్ర ప్రభుత్వం జిల్లాకు పసుపు బోర్డు మంజూరు చేయడంతో పసుపు పంట సాగుకు ప్రోత్సాహం అందినట్లయ్యింది. పసుపు సాగుకు వెన్నుదన్నుగా నిలిచిన బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని కొన్ని గ్రామాలలో సాగు విస్తీర్ణం మునుపటికంటే ఎక్కువ పెరుగుతుండటం ఆహ్వానించదగ్గ పరిణామమని రైతులు చెబుతున్నారు.

పసుపు సాగు సంవత్సరాల వారీగా

సంవత్సరం	సాగు విస్తీర్ణం
2020-21	41,016
2021-22	40,061
2022-23	21,913
2023-24	24,509
2024-25	23,941
2025-26	28 వేల నుంచి 29 వేల వరకు (అంచనా)

ఎంపీ, కేంద్రానికి రుణపడి ఉంటాం



ఎంపీ అర్వింద్ చొరవ తీసుకోవడంతో కేంద్ర ప్రభుత్వం జిల్లాకు పసుపు బోర్డును మంజూరు చేసింది. పసుపు పండించే రైతులకు ప్రోత్సాహం లభిస్తుండటంతో విస్తీర్ణం పెరగడానికి అవకాశం ఏర్పడింది. ఎంపీ, కేంద్రానికి రుణపడి ఉంటాం. – సోమ పెద్ద రాజారెడ్డి, రైతు, గుమ్మిర్యాల్

బోర్డు ఏర్పాటుతో ప్రయోజనాలు



సాగు విస్తీర్ణం ఏటా పెరగడానికి ఇలాంటి ప్రోత్సాహం అవసరం. ధర పెరగడంతో రైతులకు లాభాలు వస్తాయి. పసుపు బోర్డు ఏర్పాటుతో ఎన్నో రకాల ప్రయోజనాలు కలుగుతుండటంతో అందరి దృష్టి మళ్లీ పసుపు సాగుపై వైపు పడింది.

– గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, రైతు, దొన్కల్

ఇంకెన్నాళ్లీ అగచాట్లు



ఆగి ఉన్న రైలు కింది నుంచి వెళ్తున్న మహిళ



పట్టాలపై నుంచి ప్లాట్‌ఫాం ఎక్కడానికి ఇబ్బందులు పడుతున్న మహిళలు

- డిచ్‌పల్లి రైల్వే స్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలేక ప్రజల ఇక్కట్లు

డిచ్‌పల్లి : డిచ్‌పల్లి రైల్వే స్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాతికేళ్లుగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మింపజేస్తామని హామీ ఇస్తున్న ఎంపీలు మారుతున్నారు కానీ ఇంతవరకు ఏ ఒక్కరూ హామీని నిలబెట్టుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. స్టేషన్‌కు అవతలి వైపు ప్రభుత్వ ఆస్పత్రి, విద్యా సంస్థలు, కార్యాలయాలు ఉన్నాయి. విద్యార్థులతోపాటు రోగులు, ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల కోసం వివిధ గ్రామాల నుంచి వేలాది మంది నిత్యం రైల్వేస్టేషన్ మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే ఘన్‌పూర్, ముల్లంగి గ్రామాలకు వెళ్లే ప్రజలూ ఈ స్టేషన్ నుంచే వెళుతుంటారు. గూడ్స్, ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల క్రాసింగ్ సమయంలో విద్యార్థులు, రోగులు, ప్రజలు ప్రమాదకరంగా రైలు బోగీల కింద నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. బోగీల కింద నుంచి దాటుతుండగా రైలు కదిలితే ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంటర్ సప్లిమెంటరీలో 57.46 శాతం ఉత్తీర్ణత

నిజామాబాద్ అర్బన్: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలను అధికారులు సోమవారం వెల్లడించారు. మే 22 నుంచి 29 వరకు జరిగిన సప్లిమెంటరీ పరీక్షలలో జిల్లాకు చెందిన 57.46 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి తిరుమలపుడి రవికుమార్ తెలిపారు. ద్వితీయ సంవత్సరం (జనరల్)లో మొత్తం 6,497 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. అందులో 3,733 మంది పాస్‌కాగా, 57.46 శాతం ఉత్తీర్ణత నమోదైంది. వొకేషనల్ విభాగంలో మొత్తం 899 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 503 మంది పాసయ్యారు. 55 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు పేర్కొన్నారు. ప్రథమ సంవత్సరం (జనరల్) విద్యార్థులు 10,098 మంది పరీక్షలకు హాజరుకాగా 5,851 మంది పాస్‌అయ్యారని, 58శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు డీఐఈవో తెలిపారు. వొకేషనల్ విభాగంలో 1,420 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 903 మంది విద్యార్థులు పాసై 63.59 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉత్తీర్ణత శాతంలో ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 20వ స్థానం, మొదటి సంవత్సరంలో 26వ స్థానంలో నిలిచిందని తెలిపారు. కాగా, విద్యార్థులు తమ జవాబు పత్రాలను రీవాల్యుయేషన్, వెరిఫికేషన్ చేసుకునేందుకు ఈ నెల 17 నుంచి 23 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఐఈవో రవికుమార్ సూచించారు.

క్లుప్తంగా

గోదావరిలో తేలిన శివలింగం



డొంకేశ్వర్(ఆర్మూర్): గోదావరిలో ముంపునకు గురైన శివలింగం తేలింది. డొంకేశ్వర్ శివారులో ప్రతీ ఏటా ముంపునకు గురై జూన్, జూలై నెలల మధ్య నీళ్ల తగ్గి శివలింగం బయటపడుతుంది. ఈసందర్భంగా సోమవారం డొంకేశ్వర్ సర్వసమాజ్ కమిటీ సభ్యులు శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగనీళ్లతో అభిషేకం చేసి నైవేద్యం సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడిపంటలు బాగా పండాలని కోరుకున్నారు.

నియామకం



డిచ్‌పల్లి: నిజామాబాద్ జిల్లా తైక్వాండో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి గ్రామానికి చెందిన వినోద్‌రెడ్డి నియమితులయ్యారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాజిబ్ అలీఖాన్ ఆధ్వర్యంలో సోమవారం వినోద్‌రెడ్డిని నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు అజ్మత్‌ఖాన్ తెలిపారు. అసోసియేషన్ ప్రతినిధులు, పలువురు క్రీడాకారులు, గ్రామస్తులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉచిత కుట్టు శిక్షణ

కామారెడ్డి అర్బన్: జల్ జీవన్, మహిళా సాధికారత సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ ప్రతినిధి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏదేని గ్రామంలో 25 నుంచి 30 మంది మహిళలు ముందుకు వస్తే అదే గ్రామంలో శిక్షణ ఇచ్చి ధ్రువపత్రాలు అందిస్తామని, శిక్షణ అనంతరం 50 శాతం రాయితీపై కుట్టు మిషన్లు అందజేయనున్నట్లు రవికుమార్ తెలపారు. అలాగే శిక్షణ ఇవ్వడానికి అనుభవం ఉన్న మహిళలు ముందుకు వస్తే రూ.పదివేల వేతనం చెల్లిస్తామన్నారు. వివరాలకు 95027 18116, 85007 97860ను సంప్రదించవచ్చన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
- ప్రజావాణికి 123 ఫిర్యాదులు



నిజామాబాద్ కలెక్టరేట్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, అధికారులు

నిజామాబాద్‌అర్బన్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. జిల్లాకేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు.

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాస్, ఏసీపీ శ్రీనివాస్‌లకు అర్జీలు సమర్పించారు. మొత్తం 123 ఫిర్యాదులు అందాయి. కాగా, ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

పెన్షన్ రావడం లేదు..



నాకు బీడీల పెన్షన్ రావడం లేదు. సమస్యపై గతంలో అధికారులను కలిసి విన్నవించాను. అయినా ఇప్పటి వరకు పింఛన్ ఇవ్వలేదు. ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ కూడా తిరుగుతున్నాను. దయచేసి అధికారులు స్పందించి బీడీల పెన్షన్ మంజూరు చేయాలని కోరుతున్నారు.

– ప్రమీల, ఆర్మూర్

పింఛన్ మంజూరు చేయండి..



నా భర్త కొన్ని నెలల క్రితం మరణించాడు. అతడికి పెన్షన్ వచ్చేది. అనంతరం నాకు పెన్షన్ రావాల్సి ఉంది. కానీ మూడు నెలలు కావస్తున్న పెన్షన్ ఇవ్వడం లేదు. అధికారులను కలిసినా సమస్య పరిష్కారం కావడం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి, పెన్షన్ మంజూరు చేయాలి.

– బాగిర్త, డిచ్‌పల్లి

బయోమెట్రిక్ రావడం లేదు..



నాకు బయోమెట్రిక్ రావడం లేదు. దీంతో రేషన్ బియ్యం ఇవ్వడం లేదు. అనేక సార్లు రేషన్ డీలర్‌కు వేడుకున్నాను. బయోమెట్రిక్ సమస్య ఉండడంతో ఇప్పటివరకు రేషన్ రావడం లేదు. పూట గడవడం కష్టంగా ఉంది.

– లక్ష్మి, మోకన్‌పల్లి

ట్రై సైకిల్ ఇప్పించండి..



నాకు ట్రై సైకిల్ ఇప్పించండి. కాలు లేదు పేదవాడిని పూట గడవడమే కష్టంగా ఉంది. ట్రై సైకిల్ ఇప్పిస్తే ఏదైనా పని చేసుకుంటాను. ఇదివరకే అధికారులకు విన్నవించుకున్నాను. త్వరగా ట్రై సైకిల్ ఇప్పిస్తే ఎంతో మేలు ఉంటుంది.

– సాయికుమార్, నిజామాబాద్

ఉచిత కరెంటు అందించాలి..



నాకు ఉచిత కరెంటు బిల్లు రావడం లేదు. నేను పేదరాలిని, కరెంటును అతి తక్కువగా వాడుకుంటాం. అయినా కూడా నాకు ఇప్పటివరకు ఉచిత కరెంటు బిల్లు రావడం లేదు. దయచేసి నాకు ఉచిత కరెంటు అందేలా చూడండి. సమస్యపై ఇంతకుముందు వినతిపత్రం ఇచ్చినా ఎవరూ పట్టించుకోలేదు.

– వంజరి గీత, నాందేవ్ వాడ

ఇందిరమ్మ ఇల్లు బిల్లు రాలే..



నేను మా గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకుంటున్నాను. బేస్మెంట్ వరకు పనులు పూర్తి అయ్యాయి. బేస్మెంట్ వరకు మంజూరు చేసే లక్ష రూపాయలు ఇంతవరకు రాలేదు. దీంతో పని మధ్యలోనే ఆగిపోయింది. అధికారులకు ఇప్పటివరకే ఎన్నోసార్లు విన్నవించినా డబ్బులు మంజూరు చేయడం లేదు. అధికారులు దయచేసి డబ్బులు మంజూరు చేస్తే నేను ఇల్లు కట్టుకుంటాను.

– ప్రవీణ్, అన్నన్‌పల్లి

నాటి ధంకేశ్వర్.. నేటి డొంకేశ్వర్

మీకు తెలుసా?



డొంకేశ్వర్ ముఖ చిత్రం

ఎస్సారెస్పీలో ముంపునకు గురైన డొంకేశ్వర్ గ్రామానికి పెద్ద చరిత్రే ఉంది. ధంకలు మోగించడంతోనే ఈ ఊరికి మొదట ధంకేశ్వర్ అనే పేరు వచ్చిందట. కాలక్రమేనా డొంకేశ్వర్‌గా మారింది.

- సుమారు 300 ఏళ్ల కిందట భుజంగరావు అనే వ్యక్తి నాలుగు ఎకరాల్లో ఊరిని, ఊర చెరువును స్థాపించాడు.
- ఊరికి నలు దిక్కులా బురుజులు కట్టి గడిని ఏర్పాటు చేసినట్లు చరిత్ర ఉంది.
- ఈ బురుజుల వద్ద సిపాయిలు కాపలా ఉండేవారు. ధంకలు కొట్టి సంకేతాలు ఇచ్చేవారు.
- కొన్ని రోజులకు పొద్దుటూరి రెడ్డిలు వచ్చి నాలుగెకరాల్లో ఉన్న గ్రామాన్ని 40 ఎకరాలకు విస్తరించారు. మాసం చెరువును కూడా స్థాపించాడు.
- 1975లో ఎస్సారెస్పీలో ముంపునకు గురికావడంతో ప్రస్తుతం ఉంటున్న ప్రాంతంలో నివాసాలు కట్టుకున్నారు.
- సత్య గంగవ్వ, ఆమె కొడుకు మధుసూదన్ రెడ్డి సహకారంతో ఊరి పునః నిర్మాణానికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసి భూములను పంచుకున్నారు.
- ఇళ్ల విస్తీర్ణం 80 ఎకరాల్లో ఉండగా, వ్యవసాయ భూములు 2వేలకు పైగా ఎకరాల్లో ఉంది. డొంకేశ్వర్ గ్రామానికి 1952లో భూమారెడ్డి మొదటి సర్పంచ్‌గా పని చేశారు.

– డొంకేశ్వర్(ఆర్మూర్)

'రైతు నేస్తం' కార్యక్రమం ప్రారంభం



మోపాల్ రైతువేదికలో పాల్గొన్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, తాహెర్, రాజారెడ్డి, గంగారెడ్డి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించడం, పంటల సాగులో మెళకువలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ సూచించారు. సోమవారం సాయంత్రం వ్యవసాయ యూనివర్సిటీ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి రైతు వేదికల్లో 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం రైతు భరోసా నిధులను విడుదల చేశారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, ఆర్డీవో రాజేంద్రకుమార్, మండల ప్రత్యేకాధికారి గోవింద్‌రావు, ఏవో సౌమ్య, సాయిరెడ్డి ఉన్నారు.

బ్యాంకులు సామాజిక బాధ్యతతో ఉండాలి



శంకుస్థాపన చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): బ్యాంకులు సామాజిక బాధ్యతతో ఉండాలని, వెనకబడిన గ్రామాలు, ప్రజల అభివృద్ధికి తోడ్పాటునందించాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. మండలకేంద్రంలో సోమవారం 8 జిల్లాల ఎస్‌బీఐ అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీస్ (ఏఓ) భవన నిర్మాణానికి డిప్యూటీ జనరల్ మేనేజర్ బిజయ్ కుమార్ సాహూతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్‌గౌడ్, ఎల్లోల్ల సాయిరెడ్డి, సూర్యారెడ్డి, గంగారెడ్డి, మోహన్‌రెడ్డి, ప్రతాప్‌సింగ్, సతీష్‌రెడ్డి, రాజారెడ్డి, బోర్గాం శ్రీనివాస్ ఉన్నారు.

క్రైం కార్నర్

అదుపుతప్పి బోల్తాపడిన టిప్పర్



నస్రుల్లాబాద్: మండలంలోని లింగంపల్లి గ్రామ శివారులో గల ప్రధాన రహదారిపై ఓ టిప్పర్ అదుపు తప్పి సమీప పంట పొలాల్లో బోల్తాపడింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. నస్రుల్లాబాద్ వైపు నుంచి బైరాపూర్ వైపునకు సోమవారం మొరం తీసుకొని వెళుతున్న టిప్పర్ అదుపుతప్పి పంట పొలాల్లో పడిపోయింది. డ్రైవర్ అప్రమత్తం అవ్వడంతో ఎటువంటి గాయాలు కాలేదు. అధిక లోడ్‌తో మొరం తరలించడంతో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

తాగుడుకు బానిసై ఆత్మహత్య



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం పడంపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ భూమి వద్ద సోమవారం ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై భువనేశ్వర్ తెలిపారు. మహారాష్ట్రలోని ముద్‌ఖేడ్ తాలుకా, పుంజ్ ఏక్లార గ్రామానికి చెందిన బోయిల్‌వాడ్ హన్మంతు(34)కు మండలంలోని పెద్దఎడ్గి గ్రామానికి చెందిన గంగమణితో గతంలో వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. మద్యం తాగుడుకు బానిసైన హన్మంతు జీవితంపై విరక్తి చెంది, పంట చేను వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈమేరకు మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నదిలో పడి బీహార్ యువకుడి మృతి

రుద్రూర్: మంజీరా నదిలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లిన బీహార్ రాష్ట్రానికి చెందిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు కాలుజారి నదిలో పడి మృతి చెందాడు. కోటగిరి ఎస్సై సునీల్ తెలిపిన వివరాలు ఇలా.. బీహార్ రాష్ట్రానికి చెందిన కూలీల బృందం ఇటీవల పోతంగల్ మండలం కల్లూర్ గ్రామానికి వరి నాట్లు వేయడానికి వచ్చింది. వీరిలో రాజేష్ కుమార్ సహాని(32) అనే యువకుడు ఆదివారం సాయంత్రం కాలకృత్యాలు తీర్చుకోడానికి కొడిచర్ల శివారులోని మంజీరా నది వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారి నదిలో పడిపోయాడు. వెంటనే స్థానికులు గమనించి అతడిని బయటకు తీసి చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడి సోదరుడు వీరేంద్ర కుమార్ సహాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఒకరు..

మాక్లూర్: బైక్ అదుపుతప్పి కిందపడిన వ్యక్తి తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని దుర్గానగర్‌కు చెందిన కే శంకర్ (62) తన బైక్‌పై సోమవారం నిజామాబాద్ బయలుదేరాడు. మాణిక్ బండారు శివారులో అతడి బైక్ అదుపు తప్పడంతో కిందపడి గాయపడ్డాడు. వెంటనే స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

నగరంలో గుర్తుతెలియని వ్యక్తి..



ఖలీల్‌వాడి: నగరంలోని బస్‌డిపో-1 మెయిన్ గేట్ పక్కన ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. బస్టాండ్ సెక్యూరిటీ సిబ్బంది మృతుడిని గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే వారు జీజీహెచ్‌కు తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతుడు ఎరుపు రంగు టీ షర్ట్, గ్రీన్ కలర్ ప్యాంట్ ధరించినట్లు చెప్పారు. అతడి వయస్సు సుమారు 55 నుంచి 60 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. మృతుడి సమాచారం ఎవరికైనా తెలిసినచో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో గాని ఫోన్ నంబర్ 87126 59714కు సమాచారం ఇవ్వాలన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..



అభిషేక్ (ఫైల్)

మాక్లూర్: మండలంలోని కొత్తపల్లి శివారులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలు ఇలా.. నవీపేట మండలం జన్నేపల్లికి చెందిన అభిషేక్(28) ఆదివారం తన బైక్‌పై పని నిమిత్తం నందిపేట వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో మండలంలోని కొత్తపల్లి శివారులో అతడిని ట్రాక్టర్ ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో అభిషేక్ తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికులు వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అతడు చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందినట్లు తెలిపారు. మాక్లూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేలకొరిగిన స్తంభాలు.. రోడ్డుపైనే వైర్లు



చిన్నయానం నర్సరీ వద్ద కిందికి వేలాడుతున్న విద్యుత్ వైర్లు



రోడ్డు పక్కన పడిపోయిన విద్యుత్ స్తంభం

- వారం రోజులైనా మరమ్మతులు చేపట్టని అధికారులు

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని చిన్నయానంలో వారం రోజుల క్రితం గాలివాన కారణంగా విద్యుత్ వైర్లపై చెట్టు విరిగిపడింది. అలాగే రెండు కరెంట్ స్తంభాలు నేలకొరిగాయి. కానీ ఇప్పటి వరకు ట్రాన్స్‌కో అధికారులు మరమ్మతులు చేపట్టలేదు. ఇదే దారిగుండా ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతానికి పర్యాటకులు వచ్చి వెళ్తున్నారు. దీంతో విద్యుత్ సరఫరా జరిగితే ప్రాణాలకే ప్రమాదం ఏర్పడుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సీపీని కలిసిన బెటాలియన్ కమాండెంట్



సీపీ సాయిచైతన్యకు మొక్కను అందజేస్తున్న బెటాలియన కమాండెంట్ సత్యనారాయణ

ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ సాయి చైతన్యను సోమవారం డిచ్‌పల్లి ఏడో బెటాలియన్ కమాండెంట్ సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయనకు పూల మొక్కను అందజేశారు.

తండ్రిని హతమార్చిన కూతురు



నర్సయ్య మృతదేహం

నవీపేట: ఫాదర్స్ డే మరునాడే కన్న కూతురు చేతిలో తండ్రి హతమైన ఘటన మండలంలోని ధర్మారం(ఎ) గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. ధర్మారం గ్రామానికి చెందిన పల్లపు నర్సయ్య(54) సోమవారం మధ్యాహ్నం ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో తాళ్ల కొత్తపేటలో ఉండే చిన్నకూతురు మక్కల వర్షిణి అలియాస్ మమత రోకలి దుడ్డుతో తలపై బాది చంపేసింది. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందడంతో నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకటరెడ్డి, నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై వినయ్‌లు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి అన్న కొడుకు గంగారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. హత్యకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉందని, విచారిస్తున్నట్లు ఎస్సై వినయ్ తెలిపారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీలపై దాడులు ఆపాలి



నిరసన తెలుపుతున్న పీఎంపీ, ఆర్‌ఎంపీలు

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని ఆర్‌ఎంపీ, పీఎంపీలపై మెడికల్ కౌన్సిల్ చేపడుతున్న దాడులు వెంటనే ఆపాలని వారు డిమాండ్ చేశారు. ఈమేరకు జిల్లాలోని గ్రామీణ ఆర్‌ఎంపీ, పీఎంపీలు సోమవారం ర్యాలీ తీశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిల్లా సాయిబాబా, జిల్లా అధ్యక్షులు భాస్కర్‌రాజు మాట్లాడుతూ.. ఆర్‌ఎంపీ, పీఎంపీలపై స్టేట్ మెడికల్ కౌన్సిల్ పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు. శిక్షణ పూర్తి చేసిన గ్రామీణ వైద్యులకు సర్టిఫికేట్లు ఇచ్చి గుర్తించాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి కట్టా అశోక్, గరువ శ్రీనివాస్, రాజేశ్వర్, బోధన్, ఆర్మూర్ డివిజన్ల అధ్యక్షుల రాజగోపాల్‌చారీ, సాయిలు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీపై మహిళల దాడి



ఆర్‌ఎంపీపై చెప్పులతో దాడిచేస్తున్న మహిళలు

నిజామాబాద్‌నాగారం: ఆర్‌ఎంపీ, పీఎంపీలు చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. డిచ్‌పల్లి మండల కేంద్రానికి చెందిన ఆర్‌ఎంపీ అశోక్‌పై మహిళలు చెప్పులతో దాడి చేశారు. ఆర్‌ఎంపీ అశోక్ మహిళలతో అసభ్యకరంగా మాట్లాడుతూ, మాయమాటలతో మోసం చేస్తున్నారని ఇద్దరు మహిళలు పేర్కొంటూ చెప్పుతో దాడి చేశారు. వైద్యం కోసం వెళ్తే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు.

విద్యుత్ షాక్‌తో ఒకరికి గాయాలు



దోమకొండ: మండల కేంద్రంలో సోమవారం గ్రామపంచాయతీ కార్మికుడు విద్యుత్ షాక్‌తో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. దోమకొండలోని స్థానిక సాయిబాబా గుడి కాలనీలో విద్యుత్ స్తంభాలకు బల్బులను సరిచేయడానికి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ నిలిపివేశారు. అనంతరం వెంకట్‌రెడ్డి పనులు చేస్తుండగా విద్యుత్ వైర్లు ఇనుప స్తంభానికి తగలడంతో అతడికి కరెంట్ షాక్ తగిలి కింద పడిపోయాడు. ఈ ఘటనలో అతడికి తీవ్ర గాయాలు కాగా గ్రామపంచాయతీ కార్యదర్శి యాదగిరి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ సిబ్బందితో అక్కడికి చేరుకొని, ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు వారు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల పంచాయతీ కార్మికుడికి గాయాలైనట్లు పేర్కొన్నారు.

ఆలయంలో చోరీకి పాల్పడిన నిందితుడి అరెస్టు



ఎల్లారెడ్డి: మండలంలోని హాజీపూర్ తండాలోగల సేవాలాల్ మహరాజ్ ఆలయంలో ఈనెల 14న రాత్రి చోరీకి పాల్పడిన నిందితుడిని పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు ఎస్సై మహేష్ సోమవారం తెలిపారు. వివరాలు ఇలా.. రాంపూర్ గ్రామానికి చెందిన గడ్డండ్ల పాల్ అనే వ్యక్తి ఈనెల 14న తండాలోని ఆలయ హుండీని పగలగొట్టి అందులోని నగదును అపహరించాడు. తండాలోని సీసీ పుటేజీ ఆధారంగా నిందితుడిని పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు.

కోర్టు పేషీలకు హాజరుకాని మహిళ రిమాండ్..

ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు పరిధిలో దొంగతనం కేసులో రిమాండయిన ఓ మహిళ కోర్టు పేషిలకు హాజరు కాకుండా తిరుగుతోంది. దీంతో సదరు మహిళపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ కావడంతో ఆమెను పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మాజీలైనా.. మార్చుకోని హోదాలు



కారుపై రాసి ఉన్న 'మున్సిపల్ వైస్ చైర్మన్ భీమ్‌గల్'

జిల్లాలోని పలువురు నాయకులు పదవీలో ఉన్నప్పుడు తమ వాహనాలకు ముందు, వెనుక భాగంలో రేడియంతో తమ హోదాలను ముద్రించుకున్నారు. మున్సిపల్, పరిషత్, పంచాయతీల పదవీ కాలం ముగిసి నెలలు గడుస్తోంది. కానీ పలువురు ప్రజాప్రతినిధులు తమ హోదాలను తమ వాహనాలపై అలానే కొనసాగిస్తున్నారు. అయినా పోలీసులు, అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి వెంటనే వాటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్







కారుపై రాసి ఉన్న కార్పొరేటర్ ఎంసీఎన్ .. మరో వాహనంపై ఉన్న ఎంపీపీ రూరల్ మండలం.. మరో కారుపై ఉన్న ఎంపీపీ నవీపేట్